మార్కెట్టులో కూరలు బేరంచేసి చేతి సంచిలో నింపుకుని మెయిను రోడ్డుమీదికొచ్చాడు పద్మనాభం. ఓ చేతిలో—వంకీకి తగిలించినట్లు. గొడుగు వ్రేలాడుతోంది.

శ్రావణ మాసం.

ఎప్పుడు వర్షం వస్తుందో! ఎందుకయినా దగ్గరుండటం మంచిదన్న ఆలోచనతో తన పాతగొడుగు వెంట తెచ్చుకున్నాడు. ఎన్నోయేళ్ళ సర్వీసు వుంది ఆ గొడుక్కి. తండ్రి దగ్గర నుంచి తనకు సంక్రమించింది.

ఉన్నట్లుండి కారుమబ్బులు క్రమ్ముకొచ్చినయ్ ఆకాశంచిక్కబడిపోయింది. పెటిల్! పెటిల్! ఉరుములు తన పాత గొడుగు ప్రయోజకత్వం సవాలు చేసినట్లనిపించింది పద్మనాభానికి.

చిటపట చినుకుల్లో గొడుగు వేసుకుని బయలుదేరాడు. అతడి నడక చురుకుదనాన్ని అధిగమిస్తూ వర్షం జోరు యెక్కువైంది గాలి విసురుకి అల్లల్లాడిపోతూ విటారుగా నిల్చోలేనన్నట్లు మొరాయిస్తోంది గొడుగు. గొడుక్కి వయసు మళ్ళినట్లు అక్కడక్కడా తూట్లు సూచిస్తున్నాయి. జాగ్రత్తగా వాడుకుంటే ఏ బాధా లేదని తెలుసు పద్మనాభానికి.

రోడ్డుకి ఇరువైపులా బారులుతీరి షాపులున్నాయి. వాటి అరుగులు సన్నగా. విశాలంగా. పై కప్పుతో ఆశ్రయమిస్తాం అంటూ ఆహ్వానిస్తున్నాయి. పద్మనాభం ఓ షాపు ప్రాంగణంలోకి అడుగుపెట్టి. చేతిలో సంచిని అరుగు మీద పెట్టి. గొడుకు మూసేసి ఓ ప్రక్కగా ఆనించాడు.

వర్షం ఉధృతం హెచ్చింది. మెయిను రోడ్డు నిర్మానుష్య మవటానికి క్షణాలు పట్టలేదు

ఏం వాన? అతివృష్టి అంటే ఇలాగే వుంటుందేమో! నగరంమీద కుంభవృష్టి కురిస్తే నగరవాసుల వళ్లు తుడిచిపెట్టుకుపోవడం తప్ప. ఏం ప్రయోజనముంది? అంతా వేస్ట్! బీళ్ళు వర్ష ప్రాంతాల్లోగాని. మంచినీటికకరువై పోయిఅర్రులుచాస్తోన్న పల్లెల్లోగాని. కుగ్రామాల్లోగాని కురవకూడదూ? ఏమిటో సృష్టి వైచిత్ర్యం!—పద్మనాభానికి పట్టుకున్న సమస్య గొడుగు గురించి.

"నువ్వా ఇక్కడే వున్నావుటోయ్!" తృళ్ళిపడి తల త్రిప్పాడు. ప్రక్కన ప్లీడరు కృష్ణయ్యగారు నిల్చుని తాపీగాచేతి రుమాలుతో బుర్ర తుడిచేసుకుంటున్నారు. ఆయన్ని అసాధ్యపు పిండం అంటుంటారు తన వీధిలో వాళ్ళు.

"నమస్కారం మేష్టారూ! మిమ్మల్ని చూశ్నేదు."

"కులాసాయేనా?" అంటూ ఆప్యాయంగా పలికి—

"గొప్ప వర్షం! దీని తప్పాదియ్యా! రెయినుకోటు తెచ్చుకుందామనుకుంటూనే పరధ్యానంగా వచ్చేశాను. ఇంత పడన్‌గా పట్టుకుంటుందనుకోలేదు. పోనీహోయ్! ఏమిటి కబుర్లు?" అన్నారు కృష్ణయ్యగారు.

"ఆ— ఏమున్నాయండీ!"—ఎటూ తోచక వర్షం వంక చూస్తో జవాబిచ్చాడు పద్మనాభం.

కొద్దిసేపు యిద్దరిమధ్య మౌనం చోటు చేసుకుంది.


"ఈ వాన అసలు తగ్గుతుందంటావా?" అనుమానంగా అడిగారు కృష్ణయ్యగారు.

"మరేనండీ!" తనకూ అనుమానంగానే వుందన్నట్లు సూచించాడు పద్మనాభం.

నిమిషాలెగిరిపోతున్నాయ్. కాని వర్షం ఆగేటట్లు కన్పించడం లేదు. అరగంట.... గంట కాలం గడిచిపోయింది. రోడ్డంతా జలం ప్రవాహంగా మెలికలు తిరిగిపోతూ పల్లానికి పారుతోంది రివ్వున వీస్తోన్న చలిగాలి గుండెల్లో వణుకు పుట్టిస్తోంది.

చివరికి కృష్ణయ్యగారే అన్నారు—"చూడోయ్! ఈ వాన ఎటూ తగ్గేలాలేదు. నా కసలే వస్తు మిగిలిపోయినయ్. పాపం! నువ్వా ఎంతసేపని వెయిట్ చేస్తావ్! ఆలస్యమెందుకోయ్!"

గొడుగు వైపు దృష్టి నిగుడించారు కృష్ణయ్యగారు. అది చూసిన పద్మనాభానికి కంపరం పుట్టుకొచ్చింది. అమ్మో!—గొడుగు విప్పి వాడితే దాన్ని పిప్పిచేసి






# గొడుగు

కె. సుబ్రహ్మణ్యం

వదిలి పెడుతుంది గదా జడివాన!

"కాస్సేపు ఆగరాం మేలండీ మేష్టారూ! గొడుగు మంచి కండీషన్లో లేదు."

"అదా నీ అభ్యంతరం! ఇంత భయస్తుడివయితే ఎన్నెట్లా చక్కబెడతావోయ్! నీ గొడుక్కేం? లక్షణంగా వుంది! వర్షం తగ్గిచస్తుందనుకోవడం నీ వెర్రి గానీ—"

మాట పూర్తి చెయ్యకుండానే అర్ధోక్తిగా వచ్చేగారు కృష్ణయ్యగారు.

కొద్ది క్షణాలు తటాపటాయించి ఓ విద్యాని కొచ్చినట్లు నంచీ. గొడుగు అందుకున్నాడు పద్మనాభం

"ఆ గొడుగు యిలా యియ్యవోయ్! నేను పట్టుకు నడుస్తాను."

గొడుగు పుచ్చుకుని విప్పి అరుగు దిగారు కృష్ణయ్యగారు. వెనక నంచీతో పద్మనాభం అనుసరించాడు.


కృష్ణయ్యగారిది భారీ శరీరం గొడుగు క్రింద చోటుచేసుకుని "రావోయ్!" అని పిలిచారు. ఆప్యాయత పుట్టిపడేటట్లు పద్మనాభాన్ని. పద్మనాభానికి గొడుగు నీడ అందటంలేదు పాపం! ఓ ప్రక్క తడిసి పోతున్నాడు. ఆయన యింకాస్త పద్దుకుంటే తనకి అంతో యింతో చోటు దొరుకుతుంది. కృష్ణయ్యగార్ని అడగటానికి మొహమాటం అడ్డొస్తోంది మరి.

చాలీ చాలని ఛత్రచ్ఛాయ క్రింద వర్షంలో పది పదిహేను నిమిషాలు నడవటంతో బాగా తడిసి ముద్దయిపోయాడు పద్మనాభం. తాము నివసిస్తున్న వీధిలోకి వచ్చేసరికి అదేటైంకి తన పని ముగిసి పోయినట్లు వర్షం కాస్తా తగ్గుముఖం పట్టింది!

"అరెరే! నువ్వూ తడిసిపోయావోయ్! ఏం పల్లు కాదు గొడుగురా బాబూ! దీన్ని గిరాటేసి ఓ రెయిను కోటు కొనేసెయ్యవోయ్!"— ఉచిత సలహా ఇచ్చేశారు కృష్ణయ్యగారు.

పద్మనాభానికి ఉక్రోష మొచ్చింది. నోరు తెరవబోతే ఒక్క మాటా పెగిలి రాలేదు!

"హమ్మయ్య! మన వీధిలో పడ్డాం! నువ్వు కూడా నాతో రావటం ఎందుకు అనవసరంగా! మా వాడికిచ్చి నీ గొడుగు




పంపిస్తా.పె వ్!" అన్నారుకృష్ణయ్యగారు. పద్మనాభాన్ని అతడి ఇంటి ముందు దిగ బెడుతూ.

తలుపు తట్టి తడిసిపోయిన పిల్లిలా గుమ్మానికి పక్కగా ఒదిగిపోయున్న భర్తని. తలుపు తెరుస్తూ చూపింది ఇల్లాలు. విస్తుబోయింది

"అయ్యో! అదేమిటండీ, గొడుగేదీ?"

పీ. దసుగారి ధర్మమా అని తడిసిముద్ద యిపోయిన సంగతి ఎత్తటానికి సిగ్గేసింది పద్మనాభానికి.

"గొడుగుతోనే వచ్చాను. కృష్ణయ్య గారు పంపిస్తార్లే " కాని. కృష్ణయ్యగారు పంపలేదు

ఇది జరిగిన మర్నాడు సాయంత్రం ఆఫీసు నుంచి ఎకాఎకి గొడుగుకోసం తనే కృష్ణయ్యగారింటి కెళ్ళాడు పద్మనాభం.

ఇంటి కచేరీ గదిలో ఎవరితోనో మాట్లాడుతున్నారు కృష్ణయ్యగారు. వీధి వసారాలో నిలబడ్డ పద్మనాభానికి మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి.

"గొడుగు మీ ఆఫీసు రూంలో వదిలేసి మూడ్రోజులైందండీ! కొత్త గొడుగు. ఆ రోజు వర్షం లేనందున దాని విషయమే పట్టించుకోలేదు" అంటున్నాడో క్లయింట్.

"గొడుగు కొత్తది అని చెపుతున్నారు. దాన్ని నే నింతవరకు చూళ్ళేదు. ఇక్కడికి వచ్చే నా క్లయింట్స్‌లో ఎవరో ఒకరు అవసరానికి పట్టుకెళ్ళి వుంటారు. మూడ్రోజులు ఆలస్యం చేశారు.

వెంటనే వాకబు చేసివుంటే గొడుగు మీకు దక్కేది! ఒకవేళ ఆ పట్టుకెళ్ళిన వారు ఏదో దయతలచి తెచ్చి అప్పగిస్తే మీరు అదృష్టవంతులే. ఏమంటారు?" అంటున్నారు కృష్ణయ్యగారు.

"అది కొత్త గొడుగండీ! అందుకు.."

"విన్నానుగా! నాకూ ఓ కొత్తది వుండేది. ఇలాగే సందట్లో ఎవరో పట్టుకెళ్ళిపోయారు. అది ఇంతవకూ తిరిగి రాలేదు గొడుగు బెడద తప్పటానికి రెయిన్‌కోటు కొన్నాను. అదుగో, ఆ మూలనుంది దొక్కు గొడుగు నిన్నటి నుంచీ. అదెవరిదో తెలీదు. దానికోసం ఎవరేనా రావచ్చునని గిరాచెయ్యకుండా నిరీక్షిస్తున్నాను ఇలాగే....

మాట్లాడుతూ తక్కున ఆగిపోయారు కృష్ణయ్యగారు. ఆయన ముఖం ఒక్కసారి ముకుళించుకుపోయింది లోపికి అడుగుపెడ్తున్న పద్మనాభాన్ని చూసి.

కృష్ణయ్యగారు పలకరిస్తే తగిన విధంగా సమాధానమివ్వచ్చుననుకున్నాడు పద్మనాభం ఆయన మటుకు నోరు విప్ప లేదు. కళ్ళప్పగించి తన వొంకే చూస్తూ వుండిపోయారు.

తలుపు ప్రక్క గోడవారగా పడివున్న తన గొడుగు అందుకుని బయటికినడిచాడు పద్మనాభం. తను అనుకున్నట్లే జరిగింది.

తనకి ఏడుపొచ్చినంత అయింది. పెద్ద పెద్ద తూట్లతో అధ్వాన్నంగా రూపొందింది గొడుగు.

లోపలి నుంచి కృష్ణయ్యగారి గొంతుక లేచింది.

"మీరే చూశారుగా! ఆలస్యం చెయ్యకుండా అతను ఎంత శ్రద్ధగా తన గొడుగు పట్టుకెళ్ళిపోతున్నాడో, తన వస్తువు దక్కినందుకు మాటమాత్రంగా నాతో ఒక్క పలుకైనా పలికాడా? ఏమిటో — మనుషులు,"

విట్టూర్చారు కృష్ణయ్యగారు. ●

